
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9। కనిష్ఠం 21.1





తగ్గుతున్న చెరుకు

- నిజామాబాద్ జిల్లాలో ఫ్యాక్టరీల మూతతో తగ్గుతున్న పంట సాగు
- చెరుకు నుంచి వచ్చే ఇథనాల్‌కు భారీగా పెరిగిన డిమాండ్
- షుగర్ ఫ్యాక్టరీలపై రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సబ్ కమిటీ
- ఫ్యాక్టరీలు తెరిపించి ఉపాధి కల్పించాలని కార్మికుల వేడుకోలు

నిజామాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా చెరుకు పంటకు డిమాండ్ పెరుగుతున్నా.. నిజామాబాద్ జిల్లాలో మాత్రం ఆదరణ తగ్గుతోంది. నైజాం కాలం నుంచి వేల ఎకరాల్లో సాగైన పంట ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న రెండు ఫ్యాక్టరీలు మూత పడడంతో సాగు తగ్గిపోయింది. చెరుకు నుంచి వచ్చే ఇథనాల్, చక్కెర, బెల్లానికి డిమాండ్ పెరుగుతున్నా ఫ్యాక్టరీలు లేకపోవడం వల్ల రైతులు సాగు కు మొగ్గుచూపడం లేదు. ప్రస్తుతం చెరుకు సాగుచేసే రైతులకు లాభాలు ఉంటున్నా దూర ప్రాంతాలకు తీసుకువెళ్లే పరిస్థితి లేక రైతులు ఇతర పంటలు వేస్తున్నారు. నిజాం చక్కెర కర్మాగారంతో పాటు సారంగాపూర్ కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే మళ్లీ చెరుకు సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలపై క్యాబినెట్ సబ్ కమిటీని వేయడంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. చక్కెర కర్మాగారంలో పనిచేసే కార్మికులు కూడా ఫ్యాక్టరీ తెరిస్తే తమకు కలిసివస్తుందని, ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు.

నైజాం కాలంలో కర్మాగారం

నైజాం కాలంలో జిల్లాలోని బోధన్‌లో చక్కెర కర్మాగారం మొదలైంది. నైజాం ప్రభుత్వం ఆసియాలోనే అతి పెద్ద చక్కెర కర్మాగారాన్ని బోధన్‌లో ఏర్పాటు చేసింది. బోధన్‌తో పాటు మెట్‌పల్లిలోని ముత్యం పేట, మెదక్‌లో కూడా ఈ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసింది. ఈ ఫ్యాక్టరీల కోసం వేల ఎకరాల భూములను కూడా ఇచ్చింది. బోధన్ చక్కెర కర్మాగారం పరిధిలో వేలాది ఎకరాల్లో చెరుకు సాగైంది. బోధన్, కోటగిరి, వర్ని, ఎడపల్లి, నవీపేట, రెంజల్, నిజామాబాద్ రూరల్‌తో పాటు ఇతర మండలాల్లో చెరుకుసాగు ఎక్కువగా చేశారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 40వేల ఎకరాల వరకు చెరుకు సాగయ్యేది. చెరుకు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుండడంతో సారంగాపూర్‌లో కూడా కో ఆపరేటివ్ చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో రైతులు చాలా ఏళ్లు చెరుకు సాగు చేశారు. అయితే ఉమ్మడి రాష్ట్ర హయాంలో బోధన్‌లోని చక్కెర కర్మాగారాన్ని డిసెంబర్ 22, 2015 లో ఫ్యాక్టరీ యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్యాక్టరీని తెరిపించలేదు. దీంతో రైతులు వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

మరోవైపు.. చెరుకు రైతులకు గడిచిన కొన్నేళ్లుగా లాభాలు పెరుగుతున్నాయి. జాతీయస్థాయిలో పెట్రోల్ వినియోగం భారీగా పెరిగింది. ఈ పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలుపుతున్నారు. ఈ ఇథనాల్‌కు భారీ డిమాండ్ పెరిగింది. గతంలో చక్కెర ఫ్యాక్టరీల నుంచి చక్కె ర, బెల్లం, మొలా సిస్‌ను తయారు చేసేవారు. చక్కెర అమ్మకాలు లేకుంటే ఫ్యాక్టరీకి ఇబ్బందులు వచ్చేవి. ప్రస్తుతం మొలాసిస్ నుంచి ఇథనాల్‌ను తీస్తున్నారు. ఇథనాల్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. పెట్రోల్ ఉత్పత్తుల్లో ఈ ఇథనాల్‌ను కలుపుతుండడం వల్ల చెరుకు పండించే రైతులకు భారీగా ధరలు వస్తున్నాయి.

మంత్రి ఆధ్వర్యంలో సబ్ కమిటీ..

రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావును సభ్యులుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలను పరిశీలించి నివేదిక ఇస్తే దానికి అనుకూలంగా మూడు ఫ్యాక్టరీలను తెరిపించే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఈ మూడు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తా మని కాంగ్రెస్ నేతలు హామీ ఇవ్వడం వల్ల కమిటీ ఏర్పాటు వల్ల ఆశలు పెరుగుతున్నాయి. లాభాల తో నడిచే నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిం చాలని కార్మికులు కోరుతున్నారు.

జిల్లాలో పరిస్థితి భిన్నం

జోరుగా చెరుకు సాగు చేస్తున్న రైతులు

కామారెడ్డి జిల్లా పరిధిలో రెండు ప్రయివేటు ఫ్యాక్టరీలు

చెరుకు సాగులో నిజామాబాద్ జిల్లాతో పోలిస్తే కామారెడ్డి జిల్లాలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఈ ప్రాంతంలో రైతులు చెరుకును విపరీతంగా సాగు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా పరిధిలో రెండు ఫ్యాక్టరీలు మూతపడడం వల్ల ఈ జిల్లాలో సాగు తగ్గింది. కానీ కామారెడ్డి జిల్లా పరిధిలో రెండు ప్రయివేటు ఫ్యాక్టరీలు ఉండడం వల్ల అక్కడ చెరుకు సాగుకు డిమాండ్ ఏర్పడింది. సాగు చేసే చెరుకు రైతులకు అత్యధిక ధర కూడా వస్తోంది. టన్నుకు 3,400 రూపాయల వరకు ధర పలుకుతోంది. రైతుకు ప్రతీ సంవత్సరం ఎకరాకు లక్షన్నర రూపాయల వరకు ఆదాయం వస్తోంది. చెరకు ఫ్యాక్టరీలో ఇథనాల్ ఉత్పత్తి వల్ల ఫ్యాక్టరీలకు లాభాలు పెరిగాయి. మార్కెట్‌లో ఇథనాల్‌కు డిమాండ్ ఉండడం.. పెట్రోల్‌లో వాడకం వల్ల చెరుకు ఫ్యాక్టరీలకు ఎక్కువగా వాటితోనే లాభాలు వస్తున్నాయి. ప్రయివేటు ఫ్యాక్టరీల యజమానులు కామారెడ్డి జిల్లా పరిధిలో రైతులతో ఒప్పందాలు చేసుకుంటూ చెరుకు సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నాయి. కానీ నిజామాబాద్ పరిధిలో ఫ్యాక్టరీలు మూతపడడం వల్ల రైతులు చెరుకు సాగును బాగా తగ్గించేశారు.

ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి...



: రవిశంకర్ గౌడ్, కార్మిక సంఘం నేత


బోధన్ ఫ్యాక్టరీలో అన్నిరకాల వసతులు ఉన్నాయి. లే ఆఫ్ ప్రకటించి ఎనిమిదేళ్లు అవుతుంది. లాభాలతో నడిచే ఫ్యాక్టరీని మూసివేశారు. ప్రస్తుతం చక్కెర కర్మాగారాలన్ని లాభాలతో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పరిశీలించి వెంటనే ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి.

అధిక సాగు ఉన్నా మూసివేశారు...



: సత్యనారాయణ, కార్మికుడు

బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి కావాల్సినంత చెరుకు ఉండేది. రైతులు పెద్దఎత్తున సాగు చేశారు. పరిశ్రమకు అవసరమైనంత చెరుకు వస్తున్నా మేనేజ్‌మెంట్ లే ఆఫ్ ప్రకటించింది. క్యాబినెట్ సబ్ కమిటీ వేసిన ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకొని తిరిగి నడిపించాలి.



సమస్యల పథం



ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

కామారెడ్డిరూరల్, ఫిబ్రవరి 5: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 57 వినతులు రాగా.. ఇందులో ప్రధానంగా రెవెన్యూకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మందాపూర్ గ్రామానికి చెందిన పిట్ల రాకేష్ తనను గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్‌లు భూమి విషయంలో ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదు చేశాడు. అదే గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా చర్చి నిర్మిస్తున్నారని, వెంటనే దీన్ని ఆపాలని గ్రామ యువకులు ఫిర్యాదు చేశారు.

అలసత్వంపై ఆగ్రహం



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

నిజాంసాగర్, ఫిబ్రవరి 5 : అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని, అలా కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్‌రావు హెచ్చరించారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచుల స్థానాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు తీసుకున్నారని, ప్రత్యేకాధికారులు సమస్యలు పరిష్కరించే దిశగా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ రాజు, ఎంపీపీ జ్యోతి, వైస్ ఎంపీపీ మనోహర్, సొసైటీ చైర్మన్లు వాజీద్ అలీ, కళ్యాణి విఠల్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి



- 'జహీరాబాద్ పార్లమెంట్'లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- 'గావ్ చలో' కార్యక్రమంతో అన్ని గ్రామాల్లో పర్యటించండి
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అయోధ్యకు ప్రత్యేక రైలు
- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్ వెల్లడి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 5: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్ పార్టీ ముఖ్యనేతలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ లోక్‌సభ పార్టీ ముఖ్యనేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ్‌చుగ్ మాట్లాడుతూ.. త్వరలోనే జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు కేడర్ సిద్ధం కావాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో గెలుపే లక్ష్యంగా పని చేసి.. బీజేపీ జెండా ఎగుర వేయాలన్నారు. గావ్ చలో కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారన్నారు. ఇటీవల అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించి దేశప్రజల ఆకాంక్షను ప్రధాని నరేంద్రమోదీ నెరవేర్చారన్నారు. రామమందిర నిర్మాణ ప్రారంభించినందు వల్ల ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అయోధ్యలోని శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకునేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 192 మందిని శ్రీరామచంద్రమూర్తి దర్శనానికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. 40 సంవత్సరాలలోపు ఉన్న వారు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పంపించేందుకు ముఖ్య నేతలు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈనెల 21న సికింద్రాబాద్ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వారికి అయోధ్య పర్యటనకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్టీకి చెందిన ప్రతి ఒక్క కార్యకర్త ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ ఈ కార్యక్రమ ంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్లమెంట్ ప్రభారీ బద్దం మహిపాల్‌రెడ్డి,ఆయా నియోజకవర్గాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం

ఎన్నికల వేళ.. బదిలీలకు వేళాయే!

- ప్రారంభమైన లోక్‌సభ ఎన్నికల కసరత్తు
- బదిలీలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశించిన కేంద్ర ఎన్నికల కమిషన్
- పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలే కీలకం
- జిల్లా మెజార్టీ అధికారులకు తప్పని స్థానచలనం
- జిల్లా కలెక్టర్‌కు బదిలీల జాబితా

కామారెడ్డి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారుల బదిలీ లకు రంగం సిద్ధమవుతోంది. బదిలీలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కలెక్టర్‌లు, ఎస్పీలకు ఇప్పటికే ఆ సమా చారం అందించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ, ఈవీఎంల పరిశీలన తదితర అంశాలపై ఇప్పటికే దృష్టి సారించిన అధికారులు తాజాగా బదిలీల ప్రక్రియ కు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం శాఖల వారీగా ఎవరె వరిని ఇతర ప్రాంతాలకు పంపాలనే దానిపై జాబితాను సిద్ధం చేసినట్లు తెలు స్తోంది. కొన్ని శాఖల్లో ఇప్పటికే జాబితా సిద్ధం కాగా మిగతా శాఖలు ఆ పనిలో నిమగ్న మయ్యాయి. గతంలో ఎన్నికలతో నేరుగా సంబంధం ఉండే రెవెన్యూ, పోలీసుశాఖలో మాత్ర మే బదిలీలు చేశారు.

మూడేళ్లు పూర్తయిన వారికి బదిలీ తప్పదు

ఈ సారి ప్రత్యక్షంగా సంబంధం ఉండే వారితో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు, పరోక్షంగా సంబంధం ఉండే ఎంపీడీవోలను సైతం బదిలీ చేయాలని నిర్ణయిం చారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ కు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీవోలు కలెక్టర్‌ల ను కోరగా సానుకూలంగా స్పందించి వారిని బదిలీ చేయలేదు. కానీ ఇప్పుడు మూడు సంవత్సరాలు పూర్తయిన వారందరినీ మార్చాలని కేంద్ర ఎన్నికల కమి షన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయం లో పంచాయతీరాజ్ కమిషనర్ కూడా మూడేళ్లు పూర్త యిన అధికారులను మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పోలీసు, రెవెన్యూశాఖలో మాత్రం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే మార్చినందున ఈ ఎన్నికల నేపథ్యంలో కొందరు పలువురు సీఐలు, ఎస్ఐల బదిలీలు కొనసాగు తున్నాయి. వీరితో పాటు పలువురు డీఎస్పీలు బదిలీలు కావడం అనివార్యంగా కనిపిస్తోంది.

గతంలోనే బదిలీలు కావాల్సి ఉన్నా..

జిల్లా స్థాయి మెజార్టీ అధికారులు మూడేళ్లకు మించి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ఇటీవలే మూడేళ్లు పూర్తిచేసుకోగా మరికొందరు ఏడేళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకా రం జిల్లాలో 90 శాతం ఆయా శాఖల జిల్లా బాసులు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బదిలీ కావాల్సి ఉంది. అందరు కొత్త వారే ఉంటే ఎన్నికలకు ఇబ్బందులుగా మారుతుందని భావనతో వారిని బదిలీ చేయలేదు. ప్రస్తుతం కొన్ని శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులు మూడేళ్లు పూర్తయిన వారందరినీ మార్చాలని పట్టుబడుతుండడంతో చేసేది లేక కలెక్టర్‌లు కూడా ఆ శాఖలకు సంబంధించి మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మిగితా శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి అధికారుల నుంచి పెద్దగా ఒత్తిడి లేకపోవడంతో వారిని బదిలీ జాబితాలో చేరుస్తారా? లేక ఎన్నికలు అయ్యే వరకు ఇక్కడే కొనసాగిస్తారో అన్నది చూడాలి.

మినహా బదిలీలు ఉండకపోవ చ్చని అధికారులు పేర్కొంటున్నారు.

మెజార్టీ అధికారుల బదిలీలకు అవకాశం

ఈసారి మండల, జిల్లా పరిషత్‌లలో మెజార్టీ అధికా రులు బదిలీ కానున్నారు. కలెక్టర్, ఎస్పీలతో పాటు అడిష నల్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఆర్డీవోలు పార్ల మెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగే అవకాశం ఉంది. వీరు జిల్లాకు వచ్చి మూడేళ్లు కాకపోవడమే కారణం. లూప్‌లైన్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు తహసీల్దార్‌లు మాత్రమే బదిలీ కానున్నారు. మిగితా మండలాల తహసీల్దార్‌లు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాకు వచ్చిన వారే కావడంతో వారేవరు బదిలీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. ఇక మండల పరిషత్‌లలో మెజార్టీ ఎంపీడీవోలు బదిలీపై వెళ్లే అవ కాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఎంపీఈవోలను జిల్లా పరిధిలోనే బదిలీ చేయాలని ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పంచాయతీ, ఎక్సైజ్‌శాఖలతో పాటు ఇతరత్రాశాఖలకు చెందిన అధికారుల బదిలీలు జరగలేదు. వీరిలో చాలా మంది మూడేళ్లు పూర్తి చేసుకున్న వారు ఉండడంతో ఈ రెండు శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే పోలీసు శాఖలో

ప్రత్యేకాధికారులు

పనిలో దూసుకెళ్లాలి

కలెక్టర్ జితేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో ప్రజలకు సేవచేసే గొప్ప అవకాశం ప్రత్యేకాధికారులకు లభించిందని, వారు తమకు కేటాయించిన పనిలో దూసుకెళ్లాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి ఆదరాభిమానాలు చూరగొనేలా అంకితభావంతో పనిచేయాలన్నారు. పంచాయతిరాజ్‌చట్టం-2018పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామపంచాయతీలలో ఈనెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో పూజలు చేస్తున్న ఆర్మూర్ చైర్‌పర్సన్ పండిత్ వినీత

సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు

పెర్కిట్, ఫిబ్రవరి 5: పట్టణంలోని సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, స్థానిక కౌన్సిలర్‌లు శివాలయంలో ఆస్థాన పురోహితుడు కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భజనలు చేశారు. ఈ సందర్భంగా పొద్దుటూరి వినయ్‌రెడ్డి-అనన్య దంపతులు, చిలుక హరిత రాజుబాయి, గీత శ్రీనివాస్‌రెడ్డి, రజిత గంగారెడ్డి దంపతులు అన్నప్రసాద దాతగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, గంగాకిషన్, బోండ్ల ఆనంద్, అయ్యప్ప శ్రీనివాస్, న్యాయవాది విప్లవ్‌కుమార్, ఆలయ కమిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లు అర్పించిన చైర్‌పర్సన్

పెర్కిట్: అవిశ్వాస వీగిపోయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాదం రాజ్‌కుమార్, మురళీధర్, మీనచందు, సుంకరి సుజాత, కొంతం మురళీ, నాయకులు పండిత్ పవన్, ఎస్ఆర్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 5: ఆర్మూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారులుగా నియామితులైన వారికి గ్రామపంచాయతీ పరిపాలన వీధులపై డీఎల్‌పీవో పీవీ.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీ ముఖ్యవిధులు అయిన పారిశుధ్యం, నీటి సరఫరా, వీదిదీపాలు, పన్నుల వసూలు, మొక్కల పెంపకంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలకు అనుమతులు, లేఅవుట్ అనుమతులు ఇచ్చే విషయంలో ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర గ్రాంట్‌లను ఏలా వినియోగించాలన్న అంశంపై ఆయన వివరించారు. జీపీ అభివృద్ధి ప్రణాళిక, ఈజీఎస్, హరిత హారం, తదితర అంశాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్, బాల్కొండ ఎంపీడీవోలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ శివచరణ్, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వీఆర్‌ఏల వినతి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: వారసత్వ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఈవిషయమై ప్రత్యేకశ్రద్ధ చూపి జీవో అమలు చేయించాలని మండలంలోనివీఆర్‌ఏలు సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వారి పిల్లలకు విద్యార్హతలను బట్టి వారసత్వ ఉద్యోగాలు ఇపిప్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయమై పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని కలిసిన వారిలో విఆర్‌ఏల వారసులు సజ్జు, శంకర్, శ్రీనివాస్, మూర్తి, తదితరులు ఉన్నారు.

ఉప్లూర్ చెరువులో పడి ఒకరి మృతి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన మల్లవ్వ (50) అనే మహిళ చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత కొంత కాలంగా మానసిక, ఆరోగ్యస్థితి బాగలేకపోగా, ఒంటరితన్నాన్ని భరించలేక మనస్థాపానికి గురైన మల్లవ్వ ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని నల్ల చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి కూతురు సోని పిర్యాదు మేరకు సోమవారం మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బాధితుడికి రూ.లక్ష ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమాగౌడ్ గత మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గాయాలు ఇంకా తగ్గకపోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాగౌడ్ కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లక్ష రూపాయల ఎల్‌వోసీ మంజూరు చేసి చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

● అపస్మారకస్థితిలో ఉన్న బాలికకు వైద్యం

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన చిన్నారి ఆసియా బేగం (గౌస్ కుమార్తె) మెదడులో గడ్డ ఏర్పడి ప్రాణపాయ స్థితిలో ఉండటంతో ఇట్టి విషయం ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు మదన్ మోహన్ వెంటనే స్పందించి నిమ్స్ ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. చిన్నారి ఆసియా బేగానికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరిగిందని పేర్కొన్నారు. సకాలంలో ఆపరేషన్ నిర్వహించినందున ఆసియాబేగం ప్రాణపాయస్థితి నుంచి బయటకు పడింది. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చేసిన సహాయాన్ని మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సుద్దపల్లి గురుకుల విద్యార్థులు ప్రతిభ

డిచ్‌పల్లి,ఫిబ్రవరి5: మెదక్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీల్లో సుద్దపల్లి గురుకుల విద్యార్థులు బంగారు పతకం చాటి ప్రతిభ చాటారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో క్రీడకారులు మంచి ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ గోదావరి ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన రాణి, వైశాలి, ప్రణీత, సాత్విక, సావిక,నేహ, శ్రీబిందు, నేహ, గంగోత్రి, లను ప్రిన్సిపాల్ అభినందించారు.

భీమ్‌గల్‌లో అన్యాక్రాంతమైన చెరువు శిఖం భూములు

- కబ్జాకు గురైన రాధం చెరువు, మొగిలి చెరువు, ధర్మారాయుడుకుంట, బాబాపూర్‌కుంట, బైడిచెరువు
- అధికారుల సర్వేతో ఉలిక్కిపడుతున్న భూ కబ్జాదారులు
- రాధం చెరువు సర్వే నెంబర్‌లో వెలిసిన ఇళ్లు, వెంచర్లు



భీమ్‌గల్‌లో చెరువుల భూములను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వినోద్‌కుమార్

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి 5: భీమ్‌గల్ పట్టణంలో గత కొన్ని రోజులుగా రెవెన్యూ జిల్లాస్థాయి అధికారులు చెరువుల సర్వేను నిర్వహిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు ఎన్నోమార్లు సర్వేనిర్వహించి మమ అనిపించారు. చెరువు శిఖం భూములు కబ్జాకు గురై అక్రమంగా అడ్డగోలు సర్వేనెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసి ఇళ్లను నిర్మించి లక్షలు, కోట్లల్లో రియలేస్టేట్ వ్యాపారులు దర్జాగా సొమ్ము చేసుకున్నారు. ఈ తంతగం అంతా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహారించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో చెరువు భూములు ఆక్రమణలకు గురై దర్జాగా వెంచర్లుగా ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు దర్జాగా చెరువు భూములను కబ్జా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. భీమ్‌గల్ మున్సిపాలిటీ లోని రాధం చెరువు పట్టణీకరణ నేపద్యంలో చెరువు శివారు భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు ప్రజాప్రతినిధులు రాధం చెరువు భూములను కబ్జాలు చేసి గజం విలువకు అమ్మేశారు.

● ఈ సర్వేనైనా పకడ్బందీగా జరిగేనా

ప్రస్తుతం భీమ్‌గల్ మండలంలో చెరువుల సర్వేను అధికారులు గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వేనైనా అధికారులు పకడ్బందీగా నిర్వహించి కబ్జాకు గురైన చెరువు శిఖం భూములను స్వాధీనం చేసుకుంటారా, ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్లకు లొంగిపోతారా అన్న సందేహాలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. భీమ్‌గల్ మున్సిపాలిటీ పట్టణ సుందరీకరణలో భాగంగా రాధం చెరువును గత ప్రభుత్వ హాయంలో రాధం చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేశారు. దీంతో ఒక్కసారిగా రియలర్‌టర్ లు రాధం చెరువు సర్వేనెంబరు 27 లోని చెరువు శిఖం భూములను దర్జాగా కబ్జాచేసి సుమారు 20 ఎకరాల చెరువు భూమిని వెంచర్ లుగా మార్చి తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ లు చేసి క్రయ విక్రయాలు జరిపారు. వీరికి వత్తాసుగా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సహాయ సహకారాలు అందించి లక్షలు దండుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలు

భీమ్‌గల్ మండలంలోని చెరువులు కుంటలు కబ్జాకు గురిఅయ్యాయి. రాధం చెరువు సర్వేనెంబరు27 లో 73 ఎకరాలు, మొగిలిచెరువు సర్వేనెంబరు544 విస్తీర్ణం 41 ఎకరాలు, బైడి చెరువు సర్వే నెంబరు277 విస్తీర్ణం 43 ఎకరాలు, ధర్మారాయుడు కుంట సర్వేనెంబరు426 విస్తీర్ణం 5.38 గుంటలు, బాబాపూర్ కుంట సర్వేనెంబరు50 విస్తీర్ణం 7.29 ఎకరాలు గా వుంది. ప్రస్తుతం చెరువులు, కుంటలు పెద్ద మొత్తంలో కబ్జాకు గురి అయ్యాయి. భీమ్‌గల్ శివారులోని ధర్మారాయుడు కుంట పూర్తిస్థాయిలో కబ్జాకు గురైంది. కుంట భూమిలో ప్లాట్లు వెలిశాయి. ఇప్పటికైనా అధికారులు తూతూ మంత్రంగా సర్వేనిర్వహించకుండా అన్యాక్రాంతమైన చెరువులు, కుంటల భూములు వెలికితీయాలని, రాధం చెరువు సర్వేనెంబర్‌లో అక్రమంగా నిర్మించిన వెంచర్లను, ఇళ్లను ప్రభుత్వం తమ ఆదీనంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువుల సర్వే కొనసాగుతుంది



పై అధికారులు ఆదేశాల ప్రకారం భీమ్‌గల్ పట్టణంలోని రాధం చెరువు, చుట్టు ప్రక్కల చెరువులు, కుంటల సర్వే కొనసాగుతుంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సర్వే చేస్తున్నాము. సర్వేనెంబరు 27 రాధం చెరువు భూమిలో అక్రమంగా గృహనిర్మాణాలు చేపట్టారని తెలుసుకున్నాం. పై అధికారులకు పూర్తిస్థాయిలో నివేదికలను పంపిస్తాము. అధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

- వెంకటరమణ. తహసీల్దార్ భీమ్‌గల్

టీయూలో విద్యార్థుల ఆందోళన

- మెస్ చార్జీల అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ ● రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన విద్యార్థులు



టీయూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5: తెలంగాణ యూనివర్సిటీలోని హస్టల్‌లో అవినీతి మెస్ బిల్లుల పేరిట విద్యార్థులపై అదనపు భారం మోపుతున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ హస్టల్ విద్యార్థులు సోమవారం రిజి స్ట్రార్ చాంబర్ లో ఆందోళన చేశారు. అధిక మెస్‌బిల్లు లలకు వేస్తున్న అధికారులకు నిరసనగా విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. కొవిడ్‌తర్వాత పెరిగిన ధరలకు అనుగు ణంగా మెస్ చార్జీల అపోహతో విద్యార్థులపై అధిక భారం మోపుతూ అవినీతి బట్టబయలు అయిందని విద్యార్థులు అన్నారు. అవినీతి జరిగిన మెస్ బిల్లులను తక్షణమే మాఫీ చేసి విద్యార్థులపై భారం పడకుండా అధికార యంత్రంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 5సంవత్సరాల హస్టల్ బిల్లులు పరిశీలించి ఎక్కడ అవినీతి తప్పులు జరిగాయో విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేస్తామని రిజిస్ట్రార్ యాదగిరి తెలిపినట్లు విద్యార్థులు పేర్కొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇసుకను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

సిరికొండ,ఫిబ్రవరి 5: సిరికొండ మండల పరిధిలో ఏవైరన అక్రమ ఇసుక, మొరం తవ్వకాలు చేపట్టిన, అక్రమ వ్యాపారం చేసిన చట్టపర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవీందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండలో ఇసుక అక్రమ రవాణా అనే వార్త ఆంధ్రజ్యోతిలో సోమవారంప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. ఏవైరన గృహఅవసరాల కొరకు ఇసుక తీసుకోవాలంటే రూ.900డ్రాఫ్టరూపంలో బ్యాంకులో ది డిస్టిక్ కలెక్టర్ నిజామాబాద్ పేరుతో డీడీ చెల్లిం చాలని సూచించారు. డీడీ లు చెల్లించిన వారికి బుధవారం, శుక్రవారం ఇసుక రావా ణాకు అనుమతి ఇస్తామని తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు.

పెన్షన్ల పంపిణీలో చేతివాతంపై విచారణ

బీర్కూర్, ఫిబ్రవరి 5 : పెన్షన్ల పంపిణీలో తపాల శాఖ సిబ్బంది డబ్బులు నొక్కేస్తున్నారని బీర్కూర్‌కు చెందిన పలువురు లబ్దిదారులు తపాల శాఖ ఉన్నతాధికారులకు ఇటీవల సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తపాల శాఖ బోధన్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణు సోమవారం బీర్కూర్‌కు విచ్చేసి విచారణ చేపట్టారు. బీర్కూర్‌లో సుమారు వెయ్యికి పైగా పెన్షన్ లబ్దిదారులు ఉన్నారు. వికలాంగులకు రూ.4016, మిగిలిన లబ్దిదారులకు రూ.2016ల చొప్పున ప్రభుత్వం ఆసరా పెన్షన్లు అందిస్తుంది. అయితే తపాలా సిబ్బంది 4016 రూపాయలకు 4 వేలు, 2016 రూపాయలకు 2 వేలు మాత్రమే అందజేసిపైన 16 రూపా యలు నొక్కేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతినెల ఒక్కో లబ్దిదారుడి నుంచి 16 రూపాయల చొప్పున వెయ్యి మంది నుంచి 16 వేల రూపాయలు దోచుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తపాలా శాఖ అధికారి లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. మీకు గత నెల ఎన్ని డబ్బులు అందించారని విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పకడ్బందీగా వ్యవహరిద్దాం

- సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం
- నాందేడ్‌లో రాష్ట్ర సరిహద్దు పోలీసు ఉన్నతాధికారుల సంయుక్త సమావేశం
- పాల్గొన్న నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి నాందేడ్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు



సమావేశంలో పాల్గొన్న రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు

భైంసా, ఫిబ్రవరి 5 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా వ్యవహరించాలని సరిహద్దు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మహారాష్ట్ర - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో నాందేడ్ రేంజ్ డీఐజీ శశికాంత్ మహావార్కర్, నాందేడ్ ఎస్పీ కృష్ణ కొకటేల తో పాటు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగినవార్, కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మలు సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, బందోబస్తు విధానాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు ప్రణాళిక బద్ధమైన విదానాలతో ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం సమన్వయం, సమష్టి కృషితో ప్రశాంత వాతవరణంలో పూర్తయే దిశగా వ్యవహరించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం పంచుకుంటూ ఎలాంటి లోపాలకు అస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికలకు పకడ్బందీగా నిర్వహించేందుకు సరిహద్దు మార్గంలో.. సమాచారం వ్యూహం అమలు చేయడానికి రెండు రాష్ట్రాల పోలీసులు సంసిద్ధం కావాలని నిర్ణయించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రెండు నెలల ముందు నుంచి రాష్ట్రాల సరిహద్దు పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా ఎన్నికల నియమావళిలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను అందించే చర్యలు చేపట్టారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే సమాచారంతోనే అక్రమ మార్గాల ద్వారా వచ్చే మద్యం, నగదు ఇతర వాటిని అడ్డుకోవచ్చని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శనం చేసేందుకు మూడు అంచెల్లో అధికారులకు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించారు. మహారాష్ట్ర పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం వ్యవస్థను పరస్పర మార్పిడి చేసుకోవడంతోనే ఎన్నికలను సజావుగా ముగించే దిశగా కార్యచరణకు రంగం సిద్ధం చేసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికలలో ధనం, మద్యం పాత్ర విశేషంగా ఉంటుందని.. వాటిని అరికట్టడానికి ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు ఇప్పటి నుంచే సంసిద్ధంగా ఉండి విశేష కృషి చేయాలని సూచించారు. మావోయిస్టులను జిల్లాల్లోకి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చేస్తూ మావోయిస్టు యాక్షన్ టీంలను నిలువరించే బహుముఖ వ్యూహం రచించాలని పిలుపునిచ్చారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ప్రస్తుతం వినియోగిస్తున్నారని, వాటి ద్వారా ఎలాంటి సమస్యలనైనా క్షణాల్లోనే పరిష్కరించే దిశగా కింది స్థాయి సిబ్బంది కృషి చేయాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో నాందేడ్ అదనపు ఎస్పీ అభినాష్, నిర్మల్ జిల్లా భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ , ముధోల్ సీఐ మల్లేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు బాధ్యతగా పనిచేయాలి: డీపీవో




మాట్లాడుతున్న డీపీవో జయసుధ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు వారి విధుల పట్ల బాధ్యతయు తంగా పనిచేయాలని, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు.సోమవారం డిచ్‌పల్లిలోని మానవత సదన్ డివిజన్ లెవల్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అన్ని మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు వెంటనే పరిష్కరించేల చర్యలు తీసుకోవాలని డీపీవో సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ కుమార్, డివిజన్‌లోని తహసీల్దార్‌లు,ఎంపీడీవోలు,ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

చెరువులో ఇద్దరు ప్రాణ స్నేహితుల గల్లంతు

- కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో చెరువులో జారిపడి మృతి ● గణేష్ మృత దేహం లభ్యం
- అభిషేక్ మృత దేహం కోసం కొనసాగుతున్న గాలింపు



చెరువులో జాలర్లు వెతుకుతున్న దృశ్యం

బీర్కూర్, ఫిబ్రవరి 5 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చికుర్తి గణేష్ (16), వల్లు అభిషేక్ (16) అనే ఇద్దరు ప్రాణ స్నేహితులు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గ్రామ సమీపంలోని అంకూస్‌ఖాన్ చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో ఇరువురు స్నేహితులు గల్లంతయ్యారు. సాయంత్రం వరకు ఈ విషయం ఎవరికి తెలియరాలేదు. చెరువు కట్టపై బైక్, వారి చెప్పులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అలాగే ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బైక్‌ను చెప్పులను పరిశీలించారు. బైక్ గణేష్‌దని గుర్తించారు. అనంతరం గణేష్, అభిషేక్‌ల ఆచూకీ కోసం చుట్టూ పక్కల గాలించారు. వారి ఆచూకి ఎంతకు లభించలేదు. దీంతో గణేష్, అభిషేక్‌ల కుటుంబ సభ్యులు తమ కుమారులు చెరువులో పడి ఉంటారని పోలీసులతో పేర్కొన్నారు. చెరువులో గాలించమని పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీసులు గజ ఈతగాళ్ళను రప్పించి రంగంలోకి దింపారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్ళు చెరువులో గాలించి గణేష్ మృత దేహాన్ని వెలికి తీశారు. అభిషేక్ మృత దేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్ ఉదయాన్నే తన ద్విచక్ర వాహనం తీసుకుని అభిషేక్ వద్దకు వచ్చాడు. అభిషేక్ అప్పటికే స్కూల్‌కు వెళ్లేందుకు రెడీ అయ్యాడు. గణేష్ రావడంతో స్కూల్ బ్యాగ్ చర్చి వద్ద పెట్టి ఇద్దరూ వాహనంపై అంకూస్ ఖాన్ చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువు కట్టపై బైక్‌తో పాటు ఇరువురు చెప్పులు వదిలి పెట్టారు. సాయంత్రం వరకు బైక్ చెప్పులు అలాగే ఉండటంతో అటుగా వచ్చిన వారు ఏదో జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తంచేశారు. పోలీసులకు సమాచారం అందించారు. గణేష్, అభిషేక్‌లు కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయి మృతి చెంది ఉంటారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులు భావిస్తున్నారు.

● గణేష్, అభిషేక్‌లు ఇద్దరూ క్లాస్‌మేట్స్ చిన్నప్పటి నుంచి స్నేహంగా ఉండేవారు. ఇంటి పరిస్థితుల రీత్యా గణేష్ బీర్కూర్‌లో ఒక బైక్ మెకానిక్ వద్ద బైక్ మెకానిజం నేర్చుకుంటున్నాడు. అభిషేక్ బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. గణేష్ తల్లిదండ్రులు భారతి, విఠల్‌లు కూలీపనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గు రు సంతానం.ఇద్దరు కుమార్తెలు, ఒక కుమా రుడు గణేష్ ఉన్నారు. జ్యోతి, ధన్‌రాజ్‌లకు ఇద్ద రు సంతానం.ఒకకుమార్తె ఒక కుమారుడు అభిషేక్ ఉన్నాడు.వీరు గత కొన్నాళ్లగా బతుకు తెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ చిన్న చితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. అభిలాష్ ఇక్కడే నానమ్మ దగ్గర ఉంటూ పదవ తరగతి చదువుకుంటున్నాడు. గణేష్, అభిలాష్ లుమృతిచెందడంతో వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు గడ్డి వాములు దగ్ధం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన రామచంద్రనాయక్ అనే వ్యక్తికి చెందిన రెండు గడ్డి వాములు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కరెంట్ స్తంభం నుంచి విద్యుత్ మీటర్లకు సరఫరా అవుతున్న కరెంట్ తీగల నుంచి గాలికి నిప్పు రవ్వలు గడ్డివాములపై పడటంతో రెండు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. గమనించిన గ్రామస్తులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అర్పినట్లు తెలిపారు. పశువుల గ్రాసం అయిన గడ్డి కాలిపోవడంతో పశువులకు మేత ఇబ్బంది అవుతుందని ప్రభుత్వం తనకు నష్ట పరిహారం అందించాలని బాధితులు కోరాడు.

ఎస్సారెస్పీ ప్రాజెక్టులో వ్యక్తి గల్లంతు

ముప్కాల్, ఫిబ్రవరి5: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రం ముప్కాల్ గ్రామానికి చెందిన అనికెష్ రమేష్(46) వ్యక్తి గల్లంతయ్యాడు. ముప్కాల్ ఎస్సై బాస్కరచారి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పోచంపాడ్ బ్యాక్ వాటర్‌లో రోజులాగే సాయంత్రం చేపల పట్టడానికి వెళ్ళిన రమేష్ వెళ్లాడు. చేపలు పట్టడానికి తెప్పపై నుంచి ప్రమాదశాత్తు నీటిలో పడిపోయాడు. నీటికి కొద్దిదూరంలో ఉన్న శ్రీనివాస్, గంగాధర్, మరికొంత మంది జాలర్లు అరుపులు, కేకలు వినిపించగా రమేష్ వద్దకు వెళ్ళే సరికి నీటిలో కనిపించకుండా పోయాడు. రమేష్ భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని, గజ ఈతగాళ్లతో నీటిలో గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. డ్యాంమధ్యలో లోతు ఎక్కువగా ఉండడంతో గజఈతగాళ్లు ఎంత వెతికినరమేష్‌ఆచూకీ లభించలేదనిఅన్నారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి మృతి

పిట్లం ఫిబ్రవరి 5: మండల కేంద్రానికి చెందిన రాములు(33) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని సోమవారం మృతి చెందాడని ఎస్ఐ విజయ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు పిట్లం గ్రామానికి చెందిన రాములు తన భార్య అంజవ్వ ఇంట్లో ఎటువంటి పనులు ఎంత చెప్పిన చేయడం లేదని, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో నుంచి ఉదయం బయటకు వెళ్లి ఈద్గా వద్ద గల చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడని తెలిపారు.మృతునికి ఇద్దరు కూతురులు, ఒక అబ్బాయి ఉన్నారు. మృతుని తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

రెంజల్,ఫిబ్రవరి5: రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతి(35)అనే మహిళ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతికి గత ఆరు నెలల నుండి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందిందని ఆయన అన్నారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో సమస్యల తాండవం

● ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు ● అంగన్‌వాడీ, పాఠశాలకు కలిపి ఒకే టాయిలెట్ ● ఇబ్బందుల్లో విద్యార్థులు


పెద్దమల్లారెడ్డి బీసీకాలనీ ప్రాథమిక పాఠశాల ఇదే..


పాఠశాల మెట్లు ధ్వంసమైన దృశ్యం


నీటి కుళాయి చుట్టూ అధ్వానంగా ఇలా..

భిక్కనూరు, ఫిబ్రవరి 5: పాఠశాలలు దేవాలయాలతో సమాన మంటారు. అలాంటి చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు వారి పిల్లలను చదివించాలని ఎంతగానో ప్రచారాలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ పాఠశాలల్లో నెలకొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. ప్రభుత్వ పాఠశాలలకు వారి పిల్లలను పంపించాలంటే ఆలోచించే దుస్థితి నెలకొంది. దీంతో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో క్రమక్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు మరికొన్ని పాఠశాలలు మూసివేతకు గురవుతున్నాయి. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో రైతువేదిక సమీపంలో బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సైతం అనేక సమస్యలు తాండవం చేస్తున్నాయి. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ సెంటర్ ఉంది. ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 40మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో 12మంది చిన్నారులు ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు తరుచుగా రాత్రివేళల్లో మద్యం తాగి మద్యం సీసాలను వరండాలో పగుల గొట్టడం, పాఠశాలలోని వస్తువులు, మొక్కలు, మంచినీటి కుళాయిను, పాఠశాల మెట్లను ధ్వంసం చేస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారు.

● అంగన్‌వాడీ, పాఠశాలకు కలిపి ఒకే టాయిలెట్

ప్రాథమిక పాఠశాలలోని 40మంది విద్యార్థినీ, విద్యార్థులకు, పాఠశాల ఉపాధ్యాయులకు,అంగన్‌వాడీ సిబ్బందికి,చిన్నారులకు, అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఇలా అందరికి కలిపి ఒకే టాయిలెట్ ఉంది. గతంలో ప్రాథమిక పాఠశాలకు వేరుగా టాయిలెట్ ఉండేది, కానీ దానికి అనుకునే అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించి టాయిలెట్‌ను నిర్మించడంతో అందులోకి సరైనారోడ్డు లేకపోవడం, సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరు కుంది. దీంతో అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించిన టాయిలెట్‌నే అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపయో గించుకుంటున్నారు. కానీ ఇంతమందికి ఒకే టాయిలెట్ ఉండటంతో పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

● మెట్లు, వరండా ధ్వంసం, మురికిలో నీటి కుళాయి

పాఠశాలలోని రెండు భవనాలకు చెందిన మెట్లు, ర్యాంప్‌లు గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ధ్వంసం చేశారు. మెట్లు ధ్వంసం కావడంతో మెట్లు ఎక్కాలంటే విద్యార్తులు భయపడే పరిస్థితి నెలకొంది. మెట్లు బాగాలేకపోవడంతో చాలాసార్లు విద్యార్థులు జారి పడి గాయాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు పలు మార్లు మెట్లను బాగు చేయించారు. కానీ కొన్నిరోజులకు మరల గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. కాగా పాఠశాల ఆవరణలో కుళాయి చుట్టే నీరు చేరి మురికిగా మారింది. ఈ మురికి నీటి మధ్యనే కుళాయి ఉండటంతో ఈ నీరు తాగాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. వంటగది పూర్తిగా శిథిలాస్థకు చేరుకోవడంతో పాఠశాలలోని గదిలోనే ఒక పక్కన మధ్యా హ్నభోజన నిర్వహాకురాలు విద్యార్థులకు బోజనాన్ని వండుతుంది.

ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు విన్నవించా



పాఠశాలలో చాలా సమస్యలున్నాయి. పాఠశాలకు ప్రహారిగోడ లేదు. విద్యార్థులకు, తమకు, అంగన్‌వాడీ సెంటర్‌కు కలిపి ఒకే టాయిలెట్ ఉంది. ముఖ్యంగా పాఠశాల మెట్లను ఎవరో పూర్తిగా ధ్వంసం చేశారు. ఎన్నిసార్లు బాగు చేయించిన మరల ధ్వంసం చేస్తున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులతో పాటుగా తమ ఉన్నతాధికారులకు విన్నవించాను.

- జైసీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ బకాయిలను చెల్లించాలి


మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ పెండింగ్ బకాయిలను వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని సోమవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు బహుజన మున్సిపల్ ఎంప్లాయ్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే చలో కామారెడ్డి కలెక్టర్ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణ, ఎల్లారెడ్డి మున్సి పల్ యూనియన్ నాయకులు మల్లేష్, మహేందర్, సాయమ్మ, దుర్గ య్య తదితరులు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ వహించాలి : సీడీపీవో

దోమకొండ, ఫిబ్రవరి 5: విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని సీడీపీవో రోచిష్మా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, డిహబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బేటీ బచావో బేటి పడావోపై అవగాహన కల్పించారు. యోగా,ధ్యానం, చదువుపై శ్రద్ధ ఎలా ఉండాలి అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో బావయ్య, రాము, శివరాం, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాన్సువాడ టు శ్రీశైలం పాదయాత్ర

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 5: బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వరాలయం నుంచి సోమవారం శివదీక్షాగురుస్వామి సుభాష్ ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయం ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దీక్షా స్వాములు పాదయాత్ర చేపట్టారు. సుమారు 22 మందితో కలిసి 380 కిలోమీటర్ల మేర పదిరోజుల పాటు యాత్ర చేపట్టనున్నట్లు గురుస్వామి సుభాష్ తెలిపారు. దీక్షా స్వాములకు దారిలో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

బాన్సువాడ నుంచి పండరీపూర్ పాదయాత్ర

బాన్సువాడటౌన్ , ఫిబ్రవరి 5: బాన్సువాడ పట్టణంలోని పాతబాన్సువాడ హనుమాన్ మందిరం నుంచి సోమవారం భక్తులు పండరీపూర్‌కు కరణ్ మహారాజ్ ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ యాత్ర 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 13రోజుల పాటు సాగుతోందని వార్కారీ సంఘ సభ్యులు తెలిపారు. సుమారు 150 మంది భక్తులతో పాదయాత్ర చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. యాత్రలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

మద్యం దుకాణం వద్ద ఇద్దరిపై దాడి

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 5:కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్లరోడ్డులో గల శ్లోక లిక్కర్‌మార్టు వద్ద ఇద్దరు యువకులపై మద్యం దుకాణంలో పనిచేసే వ్యక్తులు సోమవారం దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలైనట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.కామారెడ్డి పట్టణంలోని అజాంపూర కుచెందిన ఆనంద్,ఆకాష్‌లు శ్లోక లిక్కర్ మార్ట్ వద్దకు వెళ్లి మద్యం తాగుతుండగా అదే సమయంలో అక్కడ వేరొక వ్యక్తి కొన్నిచీరలను పెట్టుకుని నిలబడి ఉన్నాడు.ఈ చీరలపై ఆనంద్ చేయివేసిందుకు ఆ చీరలను దొంగలిస్తు న్నారని అనుకుని లిక్కర్‌మార్ట్‌లో పనిచేసే వ్యక్తులు ఆనంద్,ఆకాశ్‌లను ప్లాస్టిక్ పైప్,కర్రలతో,చేతులతో కొట్టడంతో గాయాలపాలై కామారెడ్డి ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తూ బురదలో పడి యువకుడి మృతి

మాచారెడ్డి, ఫిబ్రవరి 5:మాచారెడ్డి మండలం భవానిపేట గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బురదలో పడి యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీర్‌పేట మండలం దోసెల గుడెంకు చెందిన టెకుమల్లకిషన్(39) పెండ్లికాకపోవడంతో వ్యస నాలకు బానిసై తిరుగుతూ ఉండేవాడు. ఈనెల 4 న రాత్రి జిల్లాలోని దోమకొండ మండల ముత్యంపేట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్తున్నా నని ఇంటి పక్కన ఉన్నవారికి చెప్పి బయలుదేరాడు. భవానిపట గ్రామ స్టేజ్ వద్ద ముత్యంపేటగ్రామానికి వెళ్లె రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డు పక్కన గత పొలం బురదలో బొక్క బోర్లపడి ఊపిరాడక ప్రాణాలు కొల్పోయాడు. మృతుని తమ్ముడు చక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చోరీ చేసిన వ్యక్తి రిమాండ్‌కు తరలింపు



చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు పంపిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5: చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో ఉన్న హుండి తాళం పగులగొట్టి సుమారు 4 వేల డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఆలయం కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పాత నేరస్తుడు అయిన పోసన్‌పల్లి గ్రామానికి చెందిన జంగ నర్సింలు (20) అనే వ్యక్తి నేరం ఒప్పుకోగా హుండీ పగుల కొట్టడానికి ఉపయోగించిన ఇనుప రాడులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

శివాలయంలో శివస్వాముల పూజలు

పిట్లం ఫిబ్రవరి 5:మండల కేంద్రంలోని రాజరాజేశ్వర శివాలయంలో సోమవారం శివస్వాములు ప్రత్యేకంగా పూజలు చేశారు.ఆలయ పూజారి బస్వరాజ్‌అప్ప ఉదయం ఆలయంలో స్వాములతో ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, పూజలు చేయించారు.స్వాములకు పిట్లంకు చెందిన రాములు అన్నదానం నిర్వహించారు.భక్తులు ఆలయంలో పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను పూజారి అందజేశారు.

పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదుల విధులు బహిష్కరణ

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 5:జిల్లా కేంద్రంలో పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల 2న రాత్రి పట్టణానికి చెందిన న్యాయవాది సుజిత్‌గౌడ్ తన సోదరునితో కలిసి పాత ఎన్‌హెచ్7 రోడ్డు వద్ద గల ఒక రెస్టారెంట్‌లో భోజనం కోసం వెళ్లాడని అప్పటికే అక్కడ ఉన్న కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్‌తో పాటు కానిస్టేబుల్‌లు న్యాయవాది వాహనాన్ని ఫోటో తీస్తుండగా ఫోటో ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించడంతో తమనే ప్రశ్నలు అడుగుతావ అని నానా బూతులు తిట్టడం మొదలుపెట్టారని ఆరోపించారు. తాను న్యాయవాదినని అలా దూషించకండని ఏదైనా ఉంటే లీగల్‌గా ప్రోసిడ్‌కండి అని న్యాయవాది సుజిత్‌గౌడ్ చెప్పడంతో మరింత రెచ్చిపోయి ఆయనపై చేసుచేసుకోవడంతో పాటు అక్రమంగా అదుపులో తీసుకుని పోలీసు జీపులో పోలీసుస్టేషన్‌కు తరలించడంతో పాటు రాత్రి నుంచి ఉదయం వరకు అక్కడే నిర్బంధించారని అన్నారు. న్యాయవాదిపై పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘటనకు సంబంధించి సదరు పోలీసు అధికారితో పాటు మిగిలిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంగళవారం సైతం విధులు బహిష్కరిం చాలని న్యాయవాదులంతా ఏకగ్రీవంగా తీర్మానంచేసినట్లు తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

దోమకొండ, ఫిబ్రవరి 5:ఆపరేషన్ సబ్ డివిజన్ దోమకొండ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు బిక్కనూర్ రైతు వేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ కిరణ్ చైతన్య సోమవారం తెలిపారు. కార్యక్రమానికి అధికారులు రామక్రిష్ణా, హాజరతారని తెలిపారు.

టీచర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 5:ఉపాధ్యాయులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి రాజు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ స్కూల్‌పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నెలవారి జీతాల బిల్లులు ప్రిపేర్ చేయుటకు ఉపాధ్యాయుల సేవలను పాఠశాలల పనివేళల సమయంలో వినియో గించరాదని తెలిపారు. ఉపాధ్యాయులు వాడుకున్న ప్రత్యేక సెలవులు, సరెండర్ లీవ్ వెంటనే వారి సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు.ముందస్తు అనుమతి లేకుండా పాఠశాల బోధన సమయంలో ఉపాధ్యాయులు ఎవరు ఎంఈవో,డీఈవో కార్యాలయాలకు వెళ్లకూడదని సూచించారు.

పేకాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు

గాంధారి, ఫిబ్రవరి 5:మండల కేంద్రంలో గల రేణుక ఎల్లమ్మ ఆలయం దగ్గర పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.గాంధారికి చెందిన లింగం,గడ్డపూరే మహేందర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2690, రెండుసెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట ఆడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్‌గా హన్మాండ్లు యాదవ్

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 5: బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కో కన్వీనర్ హన్మాండ్లు యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి అప్పజెప్పిన బాధ్యతను ఇచ్చితంగా సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రతి ఇంటింటికి చేరవేస్తానని, రా బోయే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీగెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

● ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


జ్యోతి ప్రజల్వన చేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే

సదాశివనగర్,ఫిబ్రవరి 5:ప్రతివిద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారంచేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో వైబ్రేషన్ ఈవెంట్స్‌కు ముఖ్యఅతిధులుగా హజరయ్యారు. కళాశాల విద్యార్థినిలు మూడు రంగుల జెండాలతో స్వాగతం పలికారు.గతాన్ని గుర్తుచేసుకుని వర్తమానాన్ని వినియోగించుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కష్టపడి చదివి మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డ తర్వాత చిన్ననాటి బాల్యాన్ని గుర్తుచేసుకుని మనపరిస్థితులను రాబోయేతరం విద్యార్థులకు వివరిస్తు వారి అభివృద్ధికి కొంతైన పాటుపడాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వాలు గురుకుల డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నందున మారుమూల గ్రామాల నుండి వచ్చిన విద్యార్థినిలు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తు వారి తక్కువ చేసి మాట్లాడకుండా వారు అందించిన తోడ్పాటుతోనే ఈ స్థాయికి చేరుకున్నామన్న జ్ఞాపకాలను జీవితంలో మర్చిపోకూడదన్నారు. కష్టాన్ని అనుభవిస్తు ముందుకు సాగితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పుస్తకాలను బాగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధిక,ఆర్‌సీఓ, రాష్ట్రంలోని 30 గురుకుల డిగ్రీకళాశాలల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠినచర్యలు

● దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు ● భిక్కనూర్‌లో దాబాలు, హోటళ్లలో తనిఖీలు


భిక్కనూరు దాబాలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 5: నిషేదిత మత్తుపదార్థాలను విక్రయించే వారిపట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని దోమకొండ ఎక్సైజ్ సీఐ మధుసూధన్‌రావు హెచ్చరించారు. సోమవారం భిక్కనూరులోని దాబాలు, హోటళ్లతో పాటుగా పెద్దమల్లారెడ్డి ఎక్స్‌రోడ్డులో దోమకొండ ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దోమకొండ ఎక్సైజ్ పరిధిలో మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయ్యడం జరిగిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిరోజు వాహనాలు, దాబాలు, హోటళ్లు, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీ చేయ్యడం జరుగుతుందన్నారు. అందులో బాగంగానే భిక్కనూరు నుండి జిల్లాముఖద్వారం బస్వాపూర్ వరకు 44వ జాతీరహదారి పక్కన ఉన్న దాబాలు, పెద్దమల్లారెడ్డి ఎక్స్‌రోడ్డులో 30వాహనాలను తనిఖీ చేయ్యడం జరిగిందన్నారు. దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ఎక్కడైనా గ్రామాల్లో మత్తుపదార్థాలు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది జీవన్, వహిద్దుద్దిన్, శ్రీనివాస్, బాల్‌రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటలో ఒకరికి తీవ్ర గాయాలు

మాచారెడ్డి, ఫిబ్రవరి 5: వన్యప్రాణుల వేటకు వెళ్లి వన్యప్రాణాలను నాటుతుపాకులతో చంపడానికి షికారుకు వెళ్లిన వారిలో ఒకరు తీవ్రగాయాలపాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి మాచారెడ్డి మండలం నెమలిగుట్ట తండాకు చెందిన సుమారు 15 మంది రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాకు చెందిన ముగ్గురు కలిసి మాచారెడ్డి మండలం, రాజన్న సిరిసిల్ల సరిహద్దు ప్రాంతంలో ఈనెల 4న రాత్రి వన్యప్రాణుల వేటకు వెళ్లారు. రాత్రి సమయంలో వన్యప్రాణులను వేటాడానికి సిద్ధమవుతున్న సమయంలో ఓ వ్యక్తికి ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలవడంతో గుట్టుచప్పుడు కాకుండా అతనిని అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి పేటమండల కేంద్రంలో గల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ఆయన విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది. తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్ట తాండకు చెందిన హరిలాల్. అయితే రాత్రి సమయంలో ఎలుగుబంటి దాడిచేసిందని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.కాని నాటుతుపాకి పేలి తీవ్ర గాయాలయ్యాయని మరో వాదన వినిపిస్తుంది.దీనిపై మాచారెడ్డి అటవీశాఖాధికారులు,ఎల్లారెడ్డిపేట మండల అటవీశాఖాధి కారులు సోమవారం ఉదయం నెమలిగుట్ట తండాకు చేరుకుని వివ రాలను సేకరిస్తున్నారు. నెమలిగుట్టతాండకు చెందిన కొంతమంది గత 25 సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో స్థిరపడినట్లు తెలిపారు. ఆ స్థిరపడిన వారిలో హ రిలాల్ కూడా ఉన్నారు. ఆయనతో పాటు నెమలిగుట్ట తండాకు చెందిన మరో ఇద్దరితో కలిసి హరిలాల్ వన్యప్రాణుల వేటకు వెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఎఫ్ఆర్‌వో దివ్య వివరణ కోరగా విచారణ చేపడుతున్నాం.మంగళవారం పూర్తివివరాలను వెల్లడిస్తామని తెలిపారు.గత ఏడాది క్రితం సర్ధాపూర్ తండాకు చెందిన బానోత్ రావోజీ వన్యప్రాణుల వేటలో నాటుతుపాకి పేలి చనిపోయాడు.ఇలా వన్యప్రాణుల వేటకు వెళ్తు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు


షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 5:ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారులుగా షబ్బీర్‌అలీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మంగళవారం హైదారాబాద్‌లోని సచివాలయంలో దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అమీర్ హుస్సెన్, నాయకులు ముత్తగారి శిరీష్‌గౌడ్, భైరవ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనగామలో లగ్గం షూటింగ్


రాజేంద్రప్రసాద్‌పై క్లాప్‌కొడుతున్న దృశ్యం

బీబీపేట, ఫిబ్రవరి 5:బీబీపేట మండలంలోని జనగామ గ్రామంలో లగ్గం షూటింగ్ ప్రారంభమైంది. ప్రముఖ వ్యాపారవేత్త జనగామవాసి తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో జరిగే సినిమా కాబట్టి ఈ ప్రాంతంలో సినిమాషూ టింగ్ చేస్తున్నామని జనగామ, ఇస్సానగర్, బీబీ పేట ప్రాంతాలలో సుమారు 50 రోజుల పాటు ఈ షూటింగ్ జరుగుతుందని తెలిపారు. నటకిరిటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారని తెలిపారు.మీశ్రేయోభిలాషి డైరెక్టర్ రమేష్ చెప్యాల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారని సాయిరోనాక్ హిరోపాత్రలో,గానవిలక్ష్మీ అనే కన్నడనటి ఉన్నారని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	అంబాజీపేట మ్యారేజ్
ప్రియా 35	కిస్మత్

బాన్సువాడ	
మహేశ్వరి	అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వెంకటేశ్వర	హనుమాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

